క్లుప్తంగా

సమావేశం విజయవంతం చేయండి

తిర్యాణి: తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక కోసం ఈనెల 25న మండల కేంద్రంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల్లోని 9 తెగలకు సంబంధించిన వారు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాష్, మండల ప్రధాన కార్యదర్శి తోడసం భాస్కర్, నాయకులు ధర్ము, గణపతి ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ముఖేష్ కుమార్

లింగాపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, లింగాపూర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృంద కళాకారులు బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న పథకాలు, రుణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ ముఖేష్‌కుమార్, ఉపాధ్యాయుడు మోసిన్, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్యపరీక్షలు


విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో భేటీ పడావో భేటీ బచావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నేహా ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. రక్తహీనత నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, కేజీబీవీ ఎస్‌వో కవిత, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలత, హెచ్‌వీ విక్టోరియా, ఎల్‌టీ నాగరాజు, హెచ్‌ఏ ధర్మారావు, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత


స్వాధీనం చేసుకున్న కలపతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని చిర్రకుంట సెక్షన్‌లో సోమవారం రాత్రి అటవీ అధికారులు అక్రమంగా తరలిస్తున్న కలప పట్టుకున్నట్లు రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు మండలంలో బాబాపూర్ నుంచి ఆసిఫాబాద్ వస్తున్న టాటా ఏస్ వాహనంలో అక్రమంగా కలప తరలిస్తుండగా సెక్షన్ అధికారి సాయి చరణ్ తన బృందంతో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో 2 కలప దుంగలు పట్టుకున్నట్లు తె లిపారు. వాటి విలువ రూ.8733 ఉంటుందన్నారు. తనిఖీల్లో బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి


పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: రైతులకు ఉపయోగపడే ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మంగళవారం రెబ్బెన పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా చేపడుతున్న మట్టిరోడ్డు పనులను సర్పంచ్ అహల్యాదేవితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు వీలుగా మట్టిరోడ్డు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మట్టి రోడ్డు ఏర్పాటుతో రైతులు సులువుగా తమ పంటపొలాలకు వెళ్లేందుకు వీలు కలుగుతుందన్నారు. రైతులకు ఉపయోగపడే ఉపాధిహామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధునయ్య, ఏపీవో బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ తుకారాం, రైతులు బోర్‌లాల్ పాల్గొన్నారు.

సమస్యల్లో 'గుండాల'

- ఉన్నత పాఠశాల లేక చదువులకు దూరం
- కాలమేదైనా కాలినడకే శరణ్యం
- సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు
- ఆదివాసీలకు తప్పని కష్టాలు


కాలినడకన వెళ్తున్న గ్రామస్తులు

తిర్యాణి: మండలంలోని గుండాల గ్రామం సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. చుట్టూ పచ్చని అడవితో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న గ్రామంలో కనీస సదుపాయాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గుండాల గ్రామపంచాయతీ పరిధిలో ఏడు గూడేలు ఉండగా వెయ్యికి పైగా జనాభా ఉంది.

కాలినడకనే శరణ్యం..

గుండాల గ్రామస్తులు ఏ అవసరం ఉన్నా ఆరు కిలోమీటర్ల దూరంలోని రోంపెల్లి గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గ్రామానికి రోడ్డు కూడా లేకపోవడంతో నిత్యావసర సరుకులు, రేషన్ బియ్యం, అంగన్‌వాడీ సరుకులు, పింఛన్ తదితర అవసరాల కోసం కాలినడకన రోంపెల్లికి వెళ్తుండేవారు. కాగా రెండేళ్ల క్రితం వీరు పడే కష్టాలను చూసి పోలీసులు గ్రామానికి పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మట్టి రోడ్డు నిర్మించారు. గ్రామస్తులు దాదాపు ఆరు నెలల పాటు ఆ రోడ్డుపై రాకపోకలు సాగించారు. అనంతరం వర్షాల కారణంగా రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో ప్రజలకు రోడ్డు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.

ప్రాథమిక విద్యకే పరిమితం..

గ్రామపంచాయతీ పరిధిలోని రెండు గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 3వ తరగతి వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు. మూడో తరగతి అనంతరం వయస్సు చిన్నది కావడంతో ఇతర ప్రాంతాల్లోని వసతిగృహాలకు వెళ్లలేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. మూడో తరగతి తర్వాత మేకల కాపరులుగా, వ్యవసాయ కూలీలుగా మారుతున్న దుస్థితి నెలకొంది. సమస్యల పరిష్కారం కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



రోంపెల్లి నుంచి గుండాల వరకు రోడ్డు నిర్మాణం మంజూరైనా ఫారెస్టు క్లియరెన్స్ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. పోలీసులు వేసిన మట్టి రోడ్డు వర్షాలకు పూర్తిగా కోతకు గురి కావడంతో మళ్లీ కాలినడకతోనే వెళ్తున్నాం. అత్యవసర సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే మా గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– శంకర్, గుండాల

మౌలిక సదుపాయాలు కల్పించాలి



గుండాల పంచాయతీ పరిధిలో రెండు గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో కేవలం 3వ తరగతి వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు పై చదువులు చదవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో చాలా మంది విద్యార్థులు 3వ తరగతి అయ్యాక మేకల కాపరులుగా మారుతున్నారు.

– మర్సుకోల అశోక్, గుండాల

'అమ్మ' దీక్షతో భక్తిభావం

- జంగుబాయి దీక్ష స్వీకరిస్తున్న ఆదివాసీ యువత
- పుష్యమాసంలో కఠిన నియమాలు
- మద్యం, మాంసానికి దూరం
- చెడువ్యసనాలు వీడి ఆధ్యాత్మిక మార్గంలో పయనం


పూజలు చేస్తున్న జంగుబాయి దీక్షాపరులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో పెద్దలతో పాటు యువకులు ఆధ్యాత్మిక మార్గంలో ముందుకెళ్తున్నారు. పుష్యమాసం పురస్కరించుకొని గ్రామంలోని 120 మంది ఆదివాసీ మహిళలు, పురుషులు జంగుబాయి దీక్షలు స్వీకరించారు. హనుమాన్ ఆలయంలో వారు నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయంలో భజన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఆలయం దీక్ష చేపట్టిన స్వాములతో కిటకిటలాడుతుంది.

సన్మార్గంలో యువత..

ఆదివాసీలకు పుష్యమాసం పవిత్రమైంది. ఈ మాసంలో జంగుబాయిని దర్శించుకుంటే మేలు చేకూరుతుందని వారి నమ్మకం. జంగుబాయి దీక్షాపరులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ అలవర్చుకొని సాధారణ ధోరణికి భిన్నంగా ప్రత్యేకత చాటుతున్నారు. దీక్ష చేపట్టడంలో ఒక వైపు ఆధ్యాత్మికత, మరో వైపు ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయంటే అతిశయోక్తి కాదని భక్తులు పేర్కొంటున్నారు. చాలా మంది యువకులు జంగుబాయి దీక్ష నియమాలు పాటిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు తెలియజేసేందుకు వీర్దండి గ్రామస్తులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

ఆదివాసీల్లో ఆధ్యాత్మికత..

పుష్యమాసం వచ్చిందంటే గ్రామంలో సందడి వాతావరణం నెలకొంటుంది. ఆదివాసీలు జంగుబాయి దీక్ష స్వీకరించి నెల రోజులపాటు కఠోర నియమ నిబంధనలు పాటిస్తుంటారు. శివుడు, హనుమాన్‌తో పాటు కులదేవత పెర్సాపేన్, ఇష్ట దైవం జంగుబాయి దీక్షను స్వీకరించడం ఇక్కడ ప్రత్యేకం. గ్రామంలో 420 కుటుంబాలు ఉండగా, 300 వరకు ఆదివాసీ కుటుంబాలున్నాయి. దీక్షాపరులతో పాటు కుటుంబ సభ్యులు సైతం నెల రోజులు పాదరక్షలు ధరించకుండా నియమనిష్టలతో దేవతను పూజిస్తారు. దీక్షాదారులు నేలపైనే పడుకుంటారు.

చరిత్ర వివరిస్తున్నాం..



జంగుబాయి మాలధారణ దీక్షతో భక్తిభావం పెరుగుతుంది. హనుమాన్ ఆలయంలో ప్రతిరోజు భజన చేస్తున్నాం. ఎనిమిదేళ్లుగా జంగుబాయి దీక్ష స్వీకరిస్తున్నాను. గ్రామంలో అందరికి జంగుబాయి చరిత్ర వివరిస్తున్నాం.

– పెందోర్ హరిదాస్, దీక్ష ప్రచార కార్యకర్త

దీక్షతో ప్రశాంతత



నేను నాలుగేళ్లుగా జంగుబాయి దీక్ష స్వీకరిస్తున్నా. ప్రతిరోజు వేకువజామున నిద్ర లేచి, ఉదయాన్నే స్నానం చేసి పూజలు చేస్తాను. నెలరోజుల పాటు మా గ్రామంలో అందరూ మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. దీక్షతో ప్రశాంతత కలుగుతుంది.

– పర్చాకే విద్య, వీర్దండి

చెడు వ్యసనాలకు దూరంగా..



జంగుబాయి దీక్షలు స్వీకరించాక నియమనిష్టలతో ఉంటాం. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ రోజూ ఆలయాల్లో పూజలు చేస్తాం. దీక్షతో క్రమశిక్షణ అలవడుతుంది. భక్తిభావం పెరగడంతో పాటు ఆరోగ్యం బాగుంటుంది.

-పి. రాజు, వీర్దండి

ఘనంగా నేతాజీ జయంతి



వాంకిడి: నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని భారతదేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రజానికాన్ని చైతన్య పరిచి దేశానికి స్వేచ్ఛ వాయువులు అందించిన గొప్ప స్వాతంత్య్ర సమర యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రయ్య, కళాశాల సిబ్బంది సురేందర్ కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్ కుమార్, తిరుపతి, సత్యం, జాడి సంతోష్, శ్రీకాంత్, అశ్విని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, రెబ్బెన పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచాయతీ ఆవరణలో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఎంపీటీసీ మధునయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మురళీగౌడ్, నర్సింగరావు, రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్‌గౌడ్, సోమయ్య, రమేశ్, చిరంజీవిగౌడ్, గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: స్వాతంత్య్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బెజ్జూర్ ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన్ జావిద్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీఎస్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనాథ్, కె.శ్రీనివాస్, అబ్దుల్ యాఖూబ్, సమ్మయ్య, షేక్ జమీల్, కపిల్, ఆశాజ్యోతి, సంతోష్, పుణేష్, బీఆర్‌ఎస్ నాయకులు జావిద్, జి.తిరుపతి, ఎం.అరుణ్, సూర్ల కళ్యాణ్, గుర్లె అంజన్న తదితరులు పాల్గొన్నారు.


రెబ్బెన: చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంతోష్


బెజ్జూర్: నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ

బీటీ వేయరూ..?



దహెగాం: మండలంలోని లగ్గాం ఎక్స్‌రోడ్డు నుంచి పెద్దవాగు వంతెన వరకు వర్షాకాలంలో రెన్యూవల్ బీటీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వానాకాలంలో రోడ్డు పనులు ప్రారంభించారు. కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.60 లక్షలతో బీటీ పనులు ప్రారంభించినా ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ వేయకపోవడం వల్ల దుమ్ము పడడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించండి

కెరమెరి: ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతరులకు పహానీలు ఇప్పించాలని కెరమెరికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచాయతీరాజ్, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. ముందుగా మంగళవారం మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి దర్శనానికి వచ్చిన మంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు పహానీలు లేకపోవడంతో పడుతున్న అవస్థలను మంత్రికి వివరించారు. ఏజెన్సీల్లో గిరిజనేతరులు ఇబ్బందులు పడుతున్న విషయం సీఎం దృష్టిలో ఉందని, త్వరలోనే దీనికి పరిష్కారం చూపుతామని సీతక్క పేర్కొన్నారు. నాయకులు సాగర్, సాజిద్, శ్రీనివాస్, గోపి, శంకు, మిలింద్, వెంకటి తదితరులు ఉన్నారు.

ముకదంగూడ సమస్యలు తీర్చండి

మకదంగూడ గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ పతంగే లింబాదాస్ మంత్రి సీతక్కను కోరారు. మంగళవా రం జంగుబాయి పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన కా ర్యక్రమంలో ఆమెను కలిసి వినతిపత్రం అందించారు.

జీతభత్యాలు చెల్లించాలని వినతి

బెజ్జూర్: జీతభత్యాలతో పాటు హెచ్‌ఆర్ పాలసీ అమలుపర్చేలా చూడాలని బెజ్జూర్ పీఏసీఎస్ స్టాఫ్ అసిస్టెంట్ జక్కుల సత్యనారాయణ గౌడ్ కోరారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులతో గతేడాది నవంబర్‌లో విధుల్లో చేర్చుకున్నా, 41 నెలలుగా తనకు జీతభత్యాలు ఇవ్వడం లేదని వాపోయాడు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తాను అనారోగ్యం బారిన పడడంతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితి ఉందని, తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

మంత్రిని సన్మానించిన 'పాల్వాయి'


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు

కౌటాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ పట్టణంలోని కేబీ కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి సన్మానించారు. అసెంబ్లీలో త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి బడ్జెట్ ప్రతిపాదించాలని ఆయన కోరారు.

గంగాపూర్ జీపీలో నిధుల గోల్‌మాల్!


మాట్లాడుతున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: గంగాపూర్ గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు వార్డు సభ్యుడు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంగళవారం గ్రామంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు విలేకరులతో మాట్లాడారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు అవినీతికి పాల్పడ్డారన్నారు. గ్రామంలో టాయిలెట్ల నిర్మాణానికి రూ. 2లక్షల10వేల నిధులు వినియోగించారని కానీ పనులు జరగలేదని పేర్కొన్నారు. గ్రామంలో బావి నిర్మాణానికి రూ. 70వేల నిధులు ఖర్చు చేసినట్లు రికార్డు చేశారని కానీ అన్ని నిధులు అవసరం లేదని తెలిపారు. పల్లె ప్రకృతి వనం నుంచి రహదారి నిర్మాణానికి జనవరిలోనే బిల్లుల చెల్లింపులు జరిగినా ఇప్పటి వరకు పనులు జరగలేదని ఆరోపించారు. బిల్లుల దుర్వినియోగంపై గ్రామసభలో అడిగినా వివరాలు తెలపలేదన్నారు. చేయని రహదారుల పనులకు ముందస్తు బిల్లుల పేరిట రూ. 2లక్షల 50వేల నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌ను వివరణ కోరగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఒత్తిడి చేయడంతోనే ముందస్తు బిల్లులు చెల్లించామన్నారు. వార్డు సభ్యులు ప్రసాద్, గ్రామస్తులు ఉన్నారు.

కొలాంగూడ సందర్శన

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి-హెచ్ పంచాయతీ పరిధి లోని కొలాంగూడను ఎంపీడీవో రమేశ్, సీడీపీవో శారద మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేందంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పౌష్టికాహార లోపం ఉన్న ముగ్గురు చిన్నారులను ఉట్నూర్‌లోని న్యూట్రిషన్ కేంద్రానికి తరలించాలన్నారు. తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, ఎంపీటీసీ రేణుక, దిలీప్ జాదవ్ తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

జైనూర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాయిసెంటర్ సార్మేడి కుమ్ర దుందేరావు అన్నారు. మంగళవారం మండలంలోని రాసిమెట్ట గ్రామంలో అయోధ్యలో శ్రీరాములోరి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడే సతీశ్, మెస్రం శ్రీకాంత్, కమిటీ సభ్యులు ఆత్రం అర్జున్, పుర్క జంగు, నగేష్, కుమ్ర చిన్ను, కుమ్ర లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

జైపూర్: రోడ్డు భద్రత మనందరి బాధ్యత కావాలని, ఫలితంగా రోడ్డు ప్రమాదాలను నివారించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలను అందరూ పాటించాలన్నారు.

కన్యకాపరమేశ్వరి వద్ద ప్రత్యేక పూజలు

వేమనపల్లి: స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం వద్ద మంగళవారం కన్యకాపరమేశ్వరి దేవి వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం దేవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, నిత్యం భజనకీర్తనలు, ప్రత్యేక పూజలు హోరెత్తుతున్నాయి.